క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని మస్తాన్ వల్లి దర్గాలో గురువారం మిలాద్–ఉన్–నబీ నెల ప్రారంభం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు పూలచాదర్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా అధ్యక్షులు ఇర్ఫాన్‌ఖాన్, సెక్రటరీ ప్యారీజాన్, కమిటీ సభ్యులు సాదిక్, జమాల్, వలిసాహెబ్ పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. వేద పండితులు స్వామి వారి ప్రతిమలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అన్నదానం పుణ్య కార్యక్రమం

మదనపల్లె సిటీ: అన్నదానం పుణ్య కార్యమని టు టౌన్ సీఐ రాజారెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రోజా లాడ్జి ఆధ్వర్యంలో వినాయకచవితి పండుగ పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్ప కార్యక్రమని సీఐ అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగభూషణరెడ్డి, శకుంతల, సంఘం నాయకులు చంద్రారెడ్డి, రామమోహన్‌రెడ్డి, హేమంత్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

మదనపల్లె: పట్టణంలోని కోమటివాని చెరువు బఫర్ జోన్ ఆక్రమణపై బహుజన యువసేన ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. చెరువు కాలువ, నీటి ప్రవాహానికి అడ్డుగా నిర్మాణాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వర్షాలు కురిస్తే ఆస్తినష్టం సంభవిస్తుందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, శశికుమార్, నిజాం బాషా, శ్రీనివాసులు, వినయ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

పెద్దమండ్యం: మదనపల్లె డీఎస్పీ మహేంద్ర గురువారం పెద్దమండ్యం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, సస్పెక్టెడ్ షీట్ ఉన్నవారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ములకలచెరువు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

కేవీపల్లె : ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎరువుల దుకాణాలు నిర్వహించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబు మోసెస్ అన్నారు. గురువారం మండలంలోని గర్నిమిట్టలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా కొరత దృష్టిలో పెట్టుకుని యూరియా అక్రమంగా నిల్వ ఉంచిన, ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు అమ్మినా డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులకు సంబంధించి అమ్మిన రికార్డులు పరిశీలించారు. రైతులు 25 శాతం నానో యూరియాను ఉపయోగించిన, సేంద్రియ పద్ధతులు పాటించిన యూరియా కొరత అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీ ఎ. యుగంధర్, వ్యవసాయాధికారిణి మాధవి పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా మెరుగైన సేవలు

బి.కొత్తకోట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా వ్యాపారులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు మెరుగైన రుణ సౌకర్యాలను అందిస్తున్నట్టు స్థానిక బ్యాంకు మేనేజర్ ఎన్.శివారెడ్డి, సింగిల్‌విండో సీఈఓ కే.ఆదినారాయణ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ డ్రోన్స్‌కు సంబంధించి రూ.5 లక్షల వరకు, వ్యాపారులకు రూ.3లక్షల వరకు, పీఎం సూర్యఘర్ పథకానికి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను 12 శాతం వడ్డీతోనే మంజూరు చేస్తామన్నారు. పీఎం సూర్య ఘర్ పాలసీ కింద రూ.436 చెల్లించాలన్నారు. అటల్ పెన్షన్ యోజన కింద 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వాళ్లు 20 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు చెల్లిస్తే రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకు పెన్షన్ వస్తుందన్నారు. బ్యాంకు ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. సింగిల్‌విండో కార్యాలయంలో ఐదు నిమిషాల్లోనే బంగారంపై రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.

మాలేపాడులో 'పొలంబడి'

మదనపల్లె రూరల్ : మండలంలోని మాలేపాడు పంచాయతీలో గురువారం పొలంబడి నిర్వహించినట్లు ఏఓ కే.నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం గురించి అవగాహన కల్పించామన్నారు. వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరాన్ని రైతులు గుర్తించాలన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని పంచాలన్నారు. మిత్ర, శత్రు పురుగులపై అవగాహన కల్పించారు.

లంబోదరుడు.. భక్తవరదుడు

- ఘనంగా చవితి వేడుకలు
- ఊరూవాడా గణపయ్యల సందడి


మదనపల్లె: గణపయ్యకు పూజలు చేస్తున్న నిసార్ అహ్మద్

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం, గురువారం పండుగ రోజులను పురస్కరించుకొని వాడవాడలా స్వామి వారి విగ్రహాలను కొలువుదీర్చారు. చలువ పందిళ్లు, రంగురంగుల మండలపాలు ఏర్పాటు చేశారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అందంగా అలంకరించారు.స్వామి వారి ఎదుట రెండురోజుల పాటు యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

వినాయకుడి సేవలో నిసార్

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ వినాయక చవితి పండగను పురస్కరించుకుని పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో భక్తులు ఏర్పాటు చేసిన గణేషుని మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయానికి పెద్దపీట వేసి భక్తులు చవితి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. భక్తుల మండపాల నిర్వహణ, నిమజ్జన వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మహేష్, ప్రసాద్ నాయక్, హరి, మహబూబ్‌బాషా, అమరేంద్ర నాయక్, మల్లికార్జున, మధునాయక్, ప్రవీణ్‌నాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి

వినాయక చవితి వేడుకలు మండలంలో వాడవాడలా వేడుకగా జరిగాయి. బి.కొత్తకోట పట్టణంలో వీధులు, ప్రధాన కూడళ్లలో మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలతో భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా గణేష్ ఉత్సవాలు

కేవీపల్లె : మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం గణేష్ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు. గురువారం విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రామసముద్రం: మండలంలో గురువారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే అన్ని ఆలయాల్లో వినాయకుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేసి ఉండ్రాళ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు వినాయకుడిని భక్తి శ్రద్ధలతో పూజించి తమ జీవితంలో విఘ్నాలను పోగొట్టాలని ప్రార్థించారు.

పార్వతి తనయా పాహిమాం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం, రూరల్ మండల పరిధిలో గణపతులు కొలువుదీరారు. బుధవారం ఇంటింటా మామిడాకులు కట్టి, పూల తోరణాలతో నింపి బొజ్జగణపయ్యకు పూజలు చేశారు. స్థానిక దేవళంవీధి, కాట్లాటపల్లెరోడ్డులోని సోమేశ్వరస్వామి, వరసిద్ధి వినాయకస్వామి, క్రిష్ణానగర్‌లోని శ్వేతార్క వినాయకుడి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు.

ఆకట్టుకున్న జగన్నాథరథయాత్ర సెట్టింగ్

స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర సెట్టింగ్ వినాయకుడి సెట్టింగ్ భక్తులను ఆకట్టుకుంది. ఇరువైపు బలరాముడు, శ్రీకృష్ణుడు, మధ్యలో వినాయకుడి ప్రతిమతో కూడిన రథాన్ని భక్తులులాగుతున్న విధంగా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, యువజన విభాగం అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

పీలేరు : పీలేరులో వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణం, గ్రామం తేడా లేకుండా వినాయక నామస్మరణలో ఊరూ వాడా మునిగి తేలాయి. పీలేరు మండలంలో దాదాపు 150 కేంద్రాల్లో లంబోదరుడిని కొలువు దీర్చారు. ఒక్క పీలేరు పట్టణంలోనే వందకుపైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. యల్లమంద క్రాస్, వినాయక స్వామి ఆలయం, మార్కెట్ కమిటీ, శివాలయం, కన్యకాపరమేశ్వరి సెంటర్లలోని భారీ వినాయక విగ్రహాలు అందరికీ ఆకట్టుకున్నాయి.

కలికిరి: మండలవ్యాప్తంగా భక్తులు వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నా పెద్ద తేడా లేకుండా వినాయకుడి పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేశారు.

వాల్మీకిపురంలో..

కలికిరి(వాల్మీకిపురం): మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ రూపాల్లో ఉన్న వినాయకుని ప్రతిమలను మండలపాల్లో ప్రతిష్ఠించి, పండ్లు, పిండి వంటలు స్వామి వారికి సమర్పించి పూజలు చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన బాల వినాయకుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వైభవంగా వినాయక చవితి వేడుకలు

నిమ్మనపల్లె : మండలంలో వినాయకచవితి వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం వినాయకచవితి సందర్భంగా నిమ్మనపల్లెతో పాటు పలు గ్రామాల్లో వినాయకప్రతిమలు ఏర్పాటుచేసి చవితి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలో వినాయచవితి సందర్భంగా బుధవారం వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ట్రాన్స్‌కో అధికారులు డీఈ గంగాధర్, ఏడీఈ గోవిందరెడ్డి, ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు.

కలకడ : మండలవ్యాప్తంగా వినాయకచవితిని ఘనంగా నిర్వహించారు. వినాయక మండపాల వద్ద భజనలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గులపోటీలు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. కలకడ టమాటా మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను వేలం పాట ద్వార వైఎస్ఎన్ మండీ యజమాని కిరణ్‌కుమార్ రూ.82 వేలు దక్కించుకున్నారు.

కురబలకోట: చవితి పండగను పురష్కరించుకుని మండలంలోని ప్రతి పల్లెలోను వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్చన కార్యక్రమాలు, అన్నదానాలు, ప్రసాదాల పంపిణీ చేశారు.


తంబళ్లపల్లె: పూజ చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు


మదనపల్లె సిటీ: రెడ్డప్పనాయుడుకాలనీలో..


గుర్రంకొండలో కొలువుదీరిన వినాయకుడు


నిమ్మనపల్లె: ప్రత్యేక అలంకరణలో గణనాథుడు


కేవీపల్లె : పూజలందుకుంటున్న గణనాథుడు


మదనపల్లె సిటీ: మహారాజ అలంకారంలో..


రామసముద్రం: గుంతయంబాడిలో..


కలికిరి(వాల్మీకిపురం): పూజలందుకుంటున్న బాల వినాయకుడు


పీలేరు : జర్నలిస్టు కాలనీలో ..


కలికిరిలో..


కురబలకోట: అంగళ్లు టమాటా మండీలో..


కలకడ : కిరణ్‌కుమార్‌కి లడ్డూ అందజేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే మానవత్వం


ప్రమాద స్థలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. గురువారం ఎమ్మెల్యే ములకలచెరువులో ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. బి.కొత్తకోట మండలం కోటావూరు సమీపంలో ములకలచెరువు నుంచి మదనపల్లెకు బైక్‌పై అమ్మచెరువుమిట్టకు చెందిన విజయ భాస్కర్‌రెడ్డి వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. ఇదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి వెళ్తూ వాహనం నుంచి గమనించి ఆగారు. వెంట ఉన్న నాయకులు, ఎమ్మెల్యే బాధితున్ని సపర్యలు చేశారు. తక్షణమే వైద్యం అందేలా ఎమ్మెల్యే వెంట వస్తున్న కారులో బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మానవత్వంతో స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి


రక్తదానం శిబిరంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కల్యాణి

మదనపల్లె సిటీ: యువత రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి కోరారు. గురువారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం ఎంతో అవసరమని ఇందు కోసం రక్త దానం చేయాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని సూచించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు అబ్దుల్లా, ఫయాజ.ఆనంద్, గంగాధర్, చరణ్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

బి.కొత్తకోట: మండల ప్రత్యేకాధికారి విశ్వనాథ్ గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గట్టు జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీసి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు.హెచ్ఎం లలిత కుమారి, క్లస్టర్ సీఎంఆర్‌టీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం


బి.కొత్తకోట: నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు


కలకడ : ప్రతిజ్ఞ చేస్తున్న సాంబశివ, వెంకటేష్ తదితరులు

బి.కొత్తకోట: హైదరాబాద్ బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారిని స్మరించుకొంటూ గురువారం సీపీఐ శ్రేణులు బి.కొత్తకోటలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జ్యోతిచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రఘునాథ్, అష్రఫల్లీ, నారాయణస్వామి, తంబయ్యశెట్టి, మంజునాథ్, రాజగోపాల్ పాల్గొన్నారు.

చెరగని దమనకాండ

2000 ఆగస్టు 28న బషీర్‌బాగ్‌లో జరిగిన దమనకాండ చరిత్రలో ఎప్పటికి గుర్తుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. గురువారం మదనపల్లె వారపుసంతలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ఆదాని సంస్థ కట్టబెడుతోందన్నారు. ప్రభాకర్, హరిశర్మ, అంజనేయులు, రమణ, రెడ్డెప్ప, నరసింహులు, ఆఫ్రీద్, సమీర్ పాల్గొన్నారు.

అమరులకు నివాళి

స్థానిక కోళ్లబైలు కాలనీలో గురువారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి, కార్యకర్తలతో కలిసి బషీర్‌బాగ్ ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. రెడ్డిశేఖర్, నారాయణమ్మ, శేఖర్, మల్లమ్మ పాల్గొన్నారు.

పేదల నడ్డి విరుస్తున్న 'కూటమి'

కలకడ : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో పేద ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ అన్నారు. బుధవారం కలకడలో సీఐటీయూ నాయకులు, విద్యుత్ వినియోగదారులతో కలిసి విలేకరులతో వారు మాట్లాడారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న బషీరాబాగ్ అమరుల స్ఫూర్తితో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విద్యుత్‌చార్జీలు తగ్గించే వరకూ ఉద్యమాలు చేపడతామని ప్రతిజ్ఞ తెలిపారు. సీఐటీయూ,ఆటోయూనియన్‌నాయకులుపాల్గొన్నారు.

సీఎంఓ గ్రీవెన్స్‌కు తప్పుడు సమాచారం

పీలేరు రూరల్ : సీఎంఓ గ్రీవెన్స్‌కు పీలేరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తప్పుడు సమాచారం ఇచ్చారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మే నెల 11న అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పీలేరు పోలీసులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు తెలియకుండా వదిలేశారని ఆరోపించారు. ఈ సంఘటనపై ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసు బనాయించారని తెలిపారు. ఈ సంఘటనలపై జిల్లా కలెక్టర్‌కు, పౌరసరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా అధికారులకు విచారణ జరపాలని ఆదేశాలు వచ్చినా, విచారణ జరపకుండా, సీఐకే విచారణ అధికారిగా ఇచ్చారన్నారు.సుధాకర్ బాబు,నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్లతోటలకు ప్రాధాన్యత

కేవీపల్లె : ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పీడీ వెంకటరత్నం అన్నారు. గురువారం మండలంలోని వగల్ల పంచాయతీలో ఉపాధిలో నాటిన మామిడి మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిలో మేలు రకమైన హిమాపసంద్, కేసర, బెంగళూరు లాంటి మంచి రకాల మామిడి ఎంపిక చేసుకోవాలని సూచించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


మదనపల్లె: వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, నాయకులు


ములకలచెరువు: వధూవరులకు ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి , నాయకులు

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ నాయకుడు సీపీ సుబ్బారెడ్డి సోదరుడు సీపీ వేణుగోపాల్‌రెడ్డి కుమారుడు గౌతమ్‌రెడ్డి వివాహం గత వారం జరిగింది. ఈ వేడుకను పురస్కరించుకుని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం మదనపల్లెలోని వేణుగోపాల్‌రెడ్డి ఇంటికి వచ్చారు. వధూవరులు గౌతమ్‌రెడ్డి, లీలా వాసంతిరెడ్డిలను పెద్దిరెడ్డి ఆశీర్వదించారు.

పెద్దిరెడ్డిని కలిసిన నేతలు

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, సమన్వయకర్త నిసార్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ మనూజ, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఎస్ఏ కరీముల్లా కలిశారు.

ములకలచెరువు: ములకలచెరువు మండలం వేపూరికోటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుల రామక్రిష్టారెడ్డి కుమారుడు ఎద్దుల సిద్దారెడ్డి వివాహ వేడుకల్లో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి పాల్గొన్నారు. ములకలచెరువు కేజీయస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జయరాంరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ సిస్టమ్స్‌తో సాంకేతిక ప్రగతికి పునాది

కురబలకోట: ఉద్యోగాల్లో రాణించడానికి విద్యార్థులకు కమ్యూనికేషన్ సిస్టమ్స్‌పై అవగాహన కీలకమని కేంద్ర మంత్రిత్వ శాఖ సొసైటీ ఫర్ అప్లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ రీసెర్చ్ శాస్త్రవేత్త దండూరి కోటి రెడ్డి అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్స్ యూనివర్సిటీ ఫస్ట్ ఇయర్ బీటెక్ విద్యార్థులకు కమ్యూనికేషన్ సిస్టమ్స్‌పై గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కమ్యూనికేషన్ వ్యవస్థ సమాచారాన్ని పంపేందుకు ఉపయోగించే పరికరాలు, నెట్‌వర్క్ సముదాయమన్నారు. ఫోన్ కాల్స్, ప్రసార వ్యవస్థలు, ఉపగ్రహాలు, రిలే స్టేషన్లు, ఇంటర్నెట్, ఉపగ్రహ సిగ్నల్స్ పైఐజీ డేటా స్పీడ్ వరకు కమ్యూనికేషన్ సిస్టమ్స్‌పై ఆధారపడి ఉంటుందన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

మదనపల్లె రూరల్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. వీలైనంతవరకు ఎక్కడికక్కడే స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనాలు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని భావించారు. అందులో భాగంగా గురువారం రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, ఫైర్, విద్యుత్, ఇరిగేషన్ అధికారులందరూ కలిసి నిమజ్జనం చెరువుల కోసం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తట్టివారిపల్లె చెరువు, రామాచార్లపల్లె చెరువు, బసినికొండ చెరువు, సామిచెరువులను వినాయక విగ్రహ నిమజ్జనాలకు అనువైన చెరువులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేంద్ర, తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, మండల పరిధిలో సుమారు 350 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారన్నారు. వీటికి సంబంధించి ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఇప్పటికే నిమజ్జనానికి సంబంధించి పలు సూచనలు చేశామన్నారు. నిమజ్జనానికి సంబంధించి కమిటీ నిర్వాహకులు పోలీసుల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించి అధికారులు సూచించిన రోడ్డు మ్యాప్ ద్వారానే... పేర్కొన్న సమయానికి విగ్రహాలను తీసుకురావాలని సూచించారు. నిమజ్జనానికి ఎంపిక చేసిన చెరువుల వద్ద రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీ అధికారులు క్రేన్లు, లైటింగ్‌తో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా బారికేడ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు అధికారులకు సహకరించి, నిమజ్జన ఉత్సవం ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఇరిగేషన్ డీఈ దయారాంప్రసాద్, ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం , మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, సీఐలు కళా వెంకటరమణ, రాజారెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం పూజలు

పీలేరు రూరల్ : అక్రమ మద్యం కేసులో అరెస్ట్ అయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ గురువారం స్థానిక సాయిబాబా గుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వార్డు సభ్యుల సాయిబాబాకు పూజలు నిర్వహించి మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కుట్రలో భాగంగానే పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. తామంతా పెద్దిరెడ్డి కుటుంబం వెన్నంటే ఉంటామని తెలిపారు. వార్డు మెంబర్లు ఉదయ్‌కుమార్, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, సచిన్, కాలేషా, విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, పరమేష్, అబీద్, రమణ పాల్గొన్నారు.


సాయిబాబాకు పూజ చేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా, వార్డుమెంబర్లు